క్లుప్తంగా

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ


ఎస్.పూర్ణతేజ


ఎన్.భాగ్యలక్ష్మి

రాజాం: ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ ప్రతిభా పరీక్షల్లో రాజాం మండలానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన సిమ్మ పూర్ణ తేజ ఈ పరీక్షల్లో స్టేట్ 10వ ర్యాంకు సాధించాడు. ఆ విద్యార్థి రాజాంలోని శ్రీవిద్యానికేతన్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు సాధారణ రోజువారీ వేతనదారులు. ఇదే మండలం ఒమ్మి గ్రామానికి చెందిన నల్లా భాగ్యలక్ష్మి ఒలింపియాడ్ మ్యాథ్స్ ప్రతిభా పరీక్షల్లో స్టేట్ 25 వ ర్యాంకు సాధించింది. ఆమె తల్లిదండ్రులు సాధారణ వ్యవసాయ కూలీలు. ఆమె రాజాంలోని విద్యానికేతన్‌లో 9వ తరగతి చదువుతోంది. ఇద్దరు విద్యార్థుల ప్రతిభను ఎంఈఓ యాగాటి దుర్గారావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ గట్టి పాపారావు తదితరులు అభినందించారు.

నేటి నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పూల్‌భాగ్‌లో ఉన్న పాత వెంకటకృష్ణ థియేటర్ ఎదురుగా మేడ పైన శుక్రవారం నుంచి ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, టాలీ, డీటీపీ, ప్లస్, సీప్లస్ తదితర కంప్యూటర్ కోర్సు విభాగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం


ర్యాలీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

వంగర: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని కింజంగి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో సేంద్రియ ఎరువులను వినియోగించి ప్రకృతి సేద్యంలో పంటలు పండివచ్చని తద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. అలాగే పంటలు వేసుకునేటప్పుడు దుక్కి పనులకు ముందు నవధాన్యాలు పొలాల్లో జల్లుకుని 45 రోజుల తర్వాత వాటిని అదే పొలంలో కలియదున్నితే నేల సారవంతం అవుతుందన ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి పి. సన్యాసినాయుడు, వీఏఏ రమ్య పాల్గొన్నారు.

వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు


రాజాం సిటీ: ఇల్లంనాయుడువలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ/రేగిడి/తెర్లాం: మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి. గురువారం జరిగిన పనులను ఎంపీడీవోలు, ఏపీవోలు పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలని తెలిపారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.307 వేతనం లభిస్తుందన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో ఉదయం, సాయంత్రం చల్లని వేళల్లో పనులు చేయాలన్నారు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


ఉపాధ్యాయిలకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈవో మోహనరావు

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని డిప్యూటీ డీఈవో కె.మోహనరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు తిరుమలప్రసాద్, పెంటయ్యలతో కలిసి గురువారం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ శతశాతం మంది విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యాబోధన, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించాలన్నారు. దాతల సహకారం, గ్రామస్తుల భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశువు ఆరోగ్యం.. పాడిరైతుకు ఆదాయం!

- పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి
- వేసవిలో వడదెబ్బకు గురయ్యే అవకాశం
- సన్‌స్ట్రోక్ బారినపడితే చూడి కట్టే చాన్స్ లేనట్టే..
- ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం
- పాల ఉత్పత్తి, నాణ్యతపై తీవ్ర ప్రభావం

జిల్లాలో పశువులు..	
పాడిఆవులు	2,31,657
పాడిగేదెలు	64,630
సేకరిస్తున్న పాలు	6,25,668 లీటర్లు


పాడిఆవుకు వైద్య పరీక్షలు చేస్తున్న ఏడీ విష్ణు(ఫైల్)

రామభద్రపురం: వేసవిలో పశుపోషణ, సంరక్షణలోనూ తగిన జాగ్రత్తలు పాటించాలని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండలు, వడగాడ్పుల కారణంగా మూగజీవాలు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందని, తద్వారా వాటిని నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పాడిరైతులు, పశుపోషకులు తమ వద్ద ఉన్న ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలు వంటి పశు సంపదను కాపాడుకోవాలని చెబుతున్నారు. సాధారణంగా 18 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత.. పశువులకు సౌకర్యంగానే ఉంటుంది. అంతకన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతేనే అవి తీవ్ర అస్వస్థతకు గురై, పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటాయి. ముఖ్యంగా వడదెబ్బ(సన్‌స్ట్రోక్)కు గురైన ఆవులు, గేదెలు చూడి కట్టే అవకాశాన్ని కోల్పోతాయి. ఒక్కోసారి మృత్యువాత పడే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించి, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వేసవి వ్యాధుల నుంచి మూగజీవాలను రక్షించుకోవచ్చని పశువైద్యాధికారులు సలహా ఇస్తున్నారు.


పొలాల్లో మేత మేస్తున్న పశువులు

పాడి పరిశ్రమపై ఆధారం..

విజయనగరం జిల్లా వ్యాప్తంగా పాడి పరిశ్రమపై ఆధారపడి ఎంతోమంది జీవనం సాగిస్తున్నారు. రైతులకు పంటలు కలిసిరాని సమయంలోనూ ఆదుకున్నదేదైనా ఉందంటే అది పాడి రంగమే. అటువంటి పాడి సంపదను కాపాడుకోవాలంటే జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. వేసవి, శీతాకాలం, వర్షాకాలం.. ఇలా ప్రత్యేక వాతావరణ పరిస్థితుల్లో వాటిని ఏ విధంగా పెంచాలి, అవి ఉండే ఆవాసాలను ఏ విధంగా తయారు చేయాలన్న వాటిపై పాడిరైతులు అవగాహన కలిగి ఉండాలి. ప్రస్తుత వేసవికాలంలో ఎండల తీవ్రత తక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లోనే పశువులను మేతకు తీసుకు వెళ్లాలి. అలాగే వాటిని ఉంచే పశువుల శాలల్లో చల్లని వాతావరణం ఉండేలా, గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాట్లు చేయాలి. వీలైనంత వరకు ఫ్యాన్లు ఏర్పాటు చేస్తే మంచిది. అలాగే ఉదయం పచ్చగడ్డి, రాత్రి ఎండుగడ్డిని మేతగా వేయాలి.

పాటించాల్సిన జాగ్రత్తలివే..
- పశువుల తాగే నీటిని స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంచాలి
- కలుషిత నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి చేరి పారుడు వ్యాధిని కలుగజేస్తాయి
- రోజులో కనీసం నాలుగు సార్లు నీటిని అందించాలి
- పగలు నీడ ప్రాంతంలోని తొట్టెలో ఉన్న నీటినే పశువులకు తాగించాలి
- ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువుల వయసు ఆధారంగా రోజుకు 35 లీటర్ల నీరు అవసరం
- పాలిచ్చే పశువులు ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల నీరు తాగుతాయి

సన్‌స్ట్రోక్ నివారణ చర్యలు..
- ✓ పశువుల పాక చుట్టూ పాత గోనె సంచులు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు చల్లని నీటితో తడుపుతూ ఉండాలి
- ✓ పశువుల పాక పాత రేకులతో వేసినట్లయితే పైకప్పును కొబ్బరి, తాటి ఆకులు లేదా వరి, రెల్లిగడ్డితో కప్పాలి.
- ✓ మంచినీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి
- ✓ ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తీసుకువెళ్లాలి
- ✓ పశువులకు వీలైనంతవరకు పచ్చనిగడ్డిని మేతగా వేయాలి
- ✓ సంకరజాతి ఆవులు, గేదెలు ఉన్న పాకలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి
- ✓ చెరువులు, కుంటలు ఉన్నట్లయితే పశువులను వాటిలో ఈదనివ్వాలి

వడదెబ్బ లక్షణాలు..
- పశువుల శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 106 డిగ్రీల వరకు పెరుగుతుంది. అలాగే నడిచేటప్పుడు పశువులు తూలుతాయి.
- శ్వాసక్రియ రేటు ఎక్కువగా ఉంటుంది. పశువులు చాలా నీరసంగా కనబడతాయి. నోటి వెంట చొంగ కూడా కారుతుంది.
- ఒక్కోసారి కింద పడి విలవిలలాడి స్పృహ కోల్పోతాయి. అదే సమయంలో పశువులు నీటి కోసం అల్లాడుతుంటాయి. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాల ఉత్పత్తి పడిపోతుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పునరుత్పత్తి ప్రక్రియ కూడా కుంటుపడుతుంది.

సొంత వైద్యం చేయొద్దు..



పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులు పశువులకు అనారోగ్య సమస్యలు వస్తే సొంత వైద్యం చేయకూడదు. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేని ప్రాంతాల్లో ఉప్పుడు, నీటి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు, అధిక శ్రమకు గురై వేడిగాలుల తాకిడికి లోనైనప్పుడు వడదెబ్బకు గురవుతాయి. సాధారణంగా ఒకటి కన్నా ఎక్కువ సంఖ్యలో ఒకేసారి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. తెల్లజాతి పశువుల కన్నా నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి.

– ఎల్ విష్ణు, పశుసంవర్ధక శాఖ ఏడీ, బొబ్బిలి

వేసవి వ్యాధుల నుంచి కాపాడుకోవాలి..



వేసవి కాలంలో పాడి సంరక్షణలో రైతులు అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా వేసవిలో ప్రబలే వ్యాధుల బారిన పడకుండా పశువులను కాపాడుకోవాలి. వడదెబ్బ తగిలిన పశువుల ముఖాన్ని చల్లని నీటితో కడగాలి. ఐస్‌ను పలుచటి వస్త్రంలో చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి. కొంతసేపు అయిన తర్వాత పశువైద్యుడి దగ్గరకు తీసుకువెళ్లి, సెలైన్ పెట్టించాలి.

–వైవీ రమణ, పశుసంవర్ధక శాఖ జేడీ, విజయనగరం

అగ్నిప్రమాదాలపై అవగాహన


రాజాం సిటీ: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

రాజాం సిటీ: అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఫైర్ ఎస్‌ఐ టీఎస్ఎస్ జనార్దనరావు సూచించారు. స్థానిక పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అగ్నిప్రమాదాలు జరిగేటప్పుడు వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించారు. అనుకోని ప్రమాదాల కారణంగా మంటలు చెలరేగితే అప్రమత్తంగా వ్యవహరించాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదం నుంచి బయట పడవచ్చన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజీ కారణంగా తలెత్తే అగ్నిప్రమాదాలు ఇతర విపత్తుల నుంచి ఏ విధంగా ప్రాణాలతో బయటపడాలో ప్రయోగాత్మకంగా వివరించి చూపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీల నిరసన

తెర్లాం: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) వద్ద మండలంలోని ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్-లెవల్ హెల్త్ ప్రొవైడర్లు)లు గురువారం నిరసన చేపట్టారు. హెల్త్ క్లినిక్‌లలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌ఓ)గా రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రతను కల్పించాలని, నివాస అద్దెలు, విద్యుత్ బిల్లులు, ఈపీఎఫ్ రీస్టార్ట్, ఫిక్స్‌డ్ జీతాలు వంటివి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


తెర్లాం పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు

వంగర: స్థానిక పీహెచ్‌సీ వద్ద ఎంఎల్‌హెచ్‌పీలు గురువారం నిరసన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 24వ తేదీన ధర్నా చేపడతామని హెచ్చరించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


బొబ్బిలిరూరల్: విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


తెర్లాం: నందబలగలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఎంఈవో త్రినాధరావు

బొబ్బిలిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇదే విషయమై మండంలోని నారసింహునిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులంతా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలకు సంబంధించి, గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందివ్వడంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామారావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల వయసు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో త్రినాధరావు సూచించారు. మండలంలోని కుసుమూరు, నందబలగ గ్రామాల్లో పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు గురువారం క్యాంపెయిన్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి పిల్లల ఇంటింటికీ వెళ్లి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయడం జరుగుతుందని, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందివ్వడం జరుగుతుందన్నారు.

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంఈవో–2 ఐండావు జగదీశ్వరి సూచించారు. మండలంలోని అరసాడ గ్రామంలో గురువారం ఆమె పర్యటించి, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలను ఇంటింటికీ వెళ్లి, పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.

• పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


వంగర: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ కృష్ణవేణి, తదితరులు


బొబ్బిలిరూరల్: సీహెచ్ బొడ్డవలసలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న పీవో విజయలక్ష్మి తదితరులు


బాడంగి: కోడూరులో గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఐసీడీఎస్ సిబ్బంది గురువారం ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. మనం రోజువారీ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భం దాల్చిన నాటి నుంచి శిశువు జన్మించిన ఆరు నెలల వరకు మహిళలు జాగ్రత్తలు పాటించాలన్నారు. తొలి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతం నిర్వహించి, ఆశీర్వదించారు.

-వంగర, బొబ్బిలి, బొబ్బిలిరూరల్, బాడంగి

కొమెరలో అభివృద్ధి పనులు


సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్న సర్పంచ్ లక్షుంనాయుడు

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. సర్పంచ్ పాడి లక్షుంనాయుడు పర్యవేక్షణలో కాలువలు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. రూ.10 లక్షల మండల పరిషత్, పంచాయతీల నిధులతో ఈ పనులు చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

రేగిడి: మండలంలోని కొండవలస గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఎంపీ ప్రసాదరావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందివ్వడంతో పాటు పౌష్టికాహారం అందివ్వాలని సిబ్బందికి తెలిపారు. మెనూ ప్రకారం వంటకాలు చేసి విద్యార్థులకు పెట్టేలా చూడాలని హెచ్‌ఎం సీహెచ్ వైకుంఠరావుకు సూచించారు.

యుద్ధప్రాతిపదికన బోర్లు మరమ్మతులు

రాజాం: మండలంలోని కంచరాం, ఒమ్మి, శ్యాంపురం తదితర గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లు మరమ్మతులు గురువారం చేపట్టారు. క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బోర్లు బాగు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు మెకానిక్‌లు తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

సంతకవిటి: మండలంలోని అప్పలాగ్రహారం గ్రామంలో పిన్నింటి లచ్చయ్య, అతని కొడుకులు కలిసి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవడంపై ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఇదివరకు వారు అదే స్థలాన్ని ఆక్రమించగా, పోలీసుల సమక్షంలో రెవెన్యూ సిబ్బంది సాయంతో ఖాళీ చేయించారు. అయినా వారు మళ్లీ ఆక్రమణకు పాల్పడుతుండడంతో ఎంపీడీవో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

సంతకవిటి: మండలంలోని గోవిందపురంలో నవధాన్యాల సాగుపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీఎల్ రీజనల్ టీమ్ ప్రకాష్, డీపీఎం.స్వామినాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకే పరిహారం



ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వ నిబంధనల మేరకే పరిహారం అందించడం జరుగుతుందని ఆర్డీవో రామ్మోహనరావు తెలిపారు. రామభద్రపురం మండలం, తారాపురంలో జాతీయ రహదారి 26 విస్తరణలో భాగంగా ఏ ఇంటి వారు ఎంత విస్తీర్ణం స్థలం కోల్పోతున్నారన్న విషయం పరిశీలనకు ఆయన.. జాతీయ రహదారి విస్తరణ సంబంధిత అధికారులతో కలిసి గురువారం క్షేత్రస్థాయికి వెళ్లారు. అనవసరంగా ఎక్కువ స్థలం కోతకు గురవ్వకుండా, బాధిత ప్రజలు నష్టపోకుండా చూడాలని అధికారులను ఆయన కోరారు. బాధిత ప్రజలకు నష్టపరిహారం ఇస్తామని, అలాగే జీవో నంబరు 23 ప్రకారం ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకుంటే ఇంటి స్థలం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వారి వెంట తహసీల్దారు సులోచన రాణి తదితరులు ఉన్నారు.

-రామభద్రపురం

మేతకు గోమాతల పాట్లు..





మేతకు గోమాతలు పాట్లు పడుతున్నాయి. విచ్చలవిడిగా సంచరిస్తూ ఏది కనపడితే అది తినివేస్తున్నాయి. ముఖ్యంగా చెత్త డబ్బాల్లోని విషపూరిత ఆహారం, ప్లాస్టిక్, పాలిథిన్ సంచులు తిని అనారోగ్యం బారినపడుతున్నాయి. కొన్ని ప్రాణాంతక వ్యాధులతో మృత్యువాత పడుతున్నాయి. బొబ్బిలి పట్టణంలో మొత్తం 72కి పైగా ఆవులు ఇలా పట్టణ వీధుల్లో రాత్రి సమయాల్లో తిరుగుతూ వ్యర్థాలను తింటున్నాయి. యజమానులే వాటిని నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇలా తిరుగాడే పశువులను మున్సిపల్ సిబ్బంది పట్టుకుని వారి యజమానులను పిలిపించి జరిమానా విధించే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

-బొబ్బిలి

అధ్వానంగా రోడ్డు



రాజాం మండల పరిధిలోని రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా గురవాం–జీఎంఆర్ ఐటీ ప్రాంతాల మధ్య రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు పొడవునా గుంతలే కనిపిస్తున్నాయి. దీంతో ఆ దారిలో వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని రోడ్లు గుంతలు పూడ్చేందుకు రూ.4 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో అక్కడక్కడి రోడ్ల గోతులు పూడ్చిన అధికారులు ఇలా ప్రధాన రహదారుల్లోని గోతులను మాత్రం అలానే వదిలేశారు. ఉంగరాడమెట్ట, మజ్జిరాముడుపేట, గురవాం, పెనుబాక, సిరిపురం తదితర గ్రామాల వద్ద రోడ్ల పరిస్థితి మరీ దారుణం. సంక్రాంతికి గోతులు లేని రోడ్లు వేసి చూపిస్తామన్న కూటమి నాయకులు వట్టి మాటలేనని, గుంతలు లేని రోడ్ల పథకం డబ్బులన్నీ గుంతల్లోనే కలిసిపోయాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

-రాజాం

రక్తదానం.. ప్రాణదానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు కోరారు. కీర్తిశేషులు పూడి సత్యనారాయణ జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని పూడి వీధి ప్రాథమిక పాఠశాలలో వందే భారత్ బ్లడ్ బ్యాంకు పర్యవేక్షణలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. రక్తం దానం చేస్తే సన్నగా అయిపోతామన్న అపోహ అందరిలో ఉందని, నిజానికి రక్తం దానం చేయడం వల్ల ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ రక్తం దానం చేయవచ్చన్నారు. మనమిచ్చే రక్తం ఒకరి ప్రాణాలను నిలపడంతో పాటు ఆ ప్రాణంపై ఆధారపడి బతికే ఓ కుటుంబాన్ని కాపాడినవారమవుతామన్నారు. తహసీల్దారు సులోచనరాణి, ఎంపీడీవో రత్నం, ఎస్‌ఐ వి.ప్రసాదరావులు శిబిరాన్ని సందర్శించారు. ఎస్‌ఐ రక్తదానం చేసి స్ఫూర్తిని నింపారు. మొత్తం 20 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.